కనకపట్నంలో కోలాహలం

దారిపొడవునా భారీ కటౌట్లు





అక్కచెల్లెమ్మల అభివాదం..



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కావలిలో కోలాహల వాతావరణం నెలకొంది. దశాబ్దాల కర్షకుల కష్టాలను తీర్చేందుకు వచ్చిన ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలుకుతూ పట్టణమంతా భారీ కటౌట్లతో స్వాగతం పలికారు. జగనన్నను చూడాలని తరలి వచ్చిన అక్కచెల్లెమ్మలు ఆయన్ను చూసి ముఖాల్లో చిరునవ్వు పులుముకుని మురిసిపోయారు. దారిపొడవునా పూలు చల్లి ఆప్యాయత కురిపించారు. ముఖ్యంగా యువతి, యువకులు కేరింతలు కొడుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమ సెల్‌ఫోన్లతో ఫొటోలు తీసుకుని సంబరపడ్డారు. రైతుల కుటుంబాలను సీఎం జగన్ పలకరించి వారి సంతోషాన్ని పంచుకున్నారు. రైతులు సీఎంకు జ్ఞాపికను అందజేశారు. – కావలి



ఆనందంతో అక్కచెల్లెమ్మల పూల వర్షం



రైతును ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం జగన్



యువతుల ఆనందహేళ



సీఎం జగన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే, మంత్రి, కలెక్టర్, జేసీ



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమం



చుక్కల భూమి నుంచి విముక్తి కల్పించే కార్యక్రమ సభా ప్రాంగణంలో కిక్కిరిసిన జనం, వేదిక ముందు వేసిన ఆర్ట్

క్లుప్తంగా

వైభవంగా సాయి మందిర వార్షికోత్సవం



విశేష అలంకారంలో సాయినాథుడు

సంగం: మండలంలోని దువ్వూరులో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో శుక్రవారం 13వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున కాగాడ హారతి తదుపరి నిత్యపూజ, అనంతరం విఘ్నేశ్వరపూజ, మండపారాధన నిర్వహించారు. అనంతరం భక్తులు 108 కలిశాలతో తెచ్చిన జలాలతో అభిషేకం చేశారు. రుద్రహోమం, కుంభాభిషేకం నిర్వహించి హారతి ఇచ్చారు. మహానివేదన, హారతి అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, పుష్పయాగం, పల్లకిసేవ, హారతి అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. జిలుమూడి శివకుమార్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జగనన్న కానుక బ్యాగుల పరిశీలన



బ్యాగులను పరిశీలిస్తున్న దృశ్యం

చేజర్ల: జగనన్న విద్యాకానుకలో భాగంగా మండలానికి వచ్చిన బ్యాగుల క్వాలిటీని పాఠశాల ఉపాధ్యాయులు పరిశీలించారు. శుక్రవారం చేజర్ల జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పి.హైమావతి బ్యాగులను పరిశీలించి సరిగా లేని వాటిని వెనక్కి పంపేలా చర్యలు చేపట్టారు. సీఆర్పీలు ఎంఐఎస్‌లు, ఐఆర్‌డీ, పీఐటీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



తొట్లలోని నీటి నిల్వను తొలగింపజేస్తున్న వైద్యసిబ్బంది

వరికుంటపాడు: మండలంలో ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు సోకకుండా దూరంగా ఉండొచ్చని సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్ఎన్ సుశీలమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని జంగంరెడ్డిపల్లిలో జరుగుతున్న ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు అందించారు. సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి లార్వా సర్వే నిర్వహించారు. ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు రామరాజు, కార్యకర్త జానకి పాల్గొన్నారు.

నర్సులకు సన్మానం

ఉదయగిరి: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోని పలువురు నర్సులకు సన్మాన కార్యక్రమం జరిగింది. వైద్యాధికారి ఠాగూర్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడంలో నర్సుల పాత్రను, ప్రాముఖ్యతను తెలిపేందుకే ప్రతి ఏడాది మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సుభానీ మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజు సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా నర్సుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అనంతరం వారు నర్సులను శాలువాలు, పూలమాలలతో సన్మానించి జ్ఞాపికలతో సత్కరించారు.

రాయితీపై పశుదాణామృతం

వరికుంటపాడు: మండలంలోని పాడిరైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై పశుదాణామృతం అందిస్తున్నట్లు పెద్దిరెడ్డిపల్లి పశువైద్యాధికారి ఎస్‌వీఎస్ రాఘవేంద్రశర్మ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం పాడిరైతుల పశువులకు రాయితీపై ఇచ్చే దాణా అవసరమైన రైతులు సమీపంలోని రైతుభరోసా కేంద్రాల్లోని పశుసంవర్ధకశాఖ సహాయకులను ఆధార్‌కార్డు, సెల్ నంబరుతో సంప్రదించి అవసరమైన దాణాకు నగదు చెల్లించాలన్నారు. ఒక్కో పాడిరైతుకు గరిష్టంగా 1,800, కనిష్టంగా 250 కిలోలు సరఫరా చేస్తామన్నారు. కిలో రూ.6.50 ఉందన్నారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరం

ఆత్మకూరు: విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేసుకోకుండా విజ్ఞానం పెంపొందించుకునేలా ఆత్మకూరు గ్రంథ భాండాగారి ఓంకారం రాజు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శుక్రవారం విజ్ఞానదాయక తరగతులు నిర్వహించారు. విజ్ఞానదాయక పుస్తకాలను వారికి అందజేసి పలు ప్రశ్నల ద్వారా వారి విజ్ఞానానికి పరీక్షలు నిర్వహించారు. సమ్మర్ క్యాంపులో లైబ్రేరితో పాటు ఉపాధ్యాయుల సహకారంతో పలు పాఠశాలల్లో విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నట్లు రాజు తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అవగాహన కల్పించి వేసవి తరగతులకు హాజరయ్యేలా చూడాలని ఆయన తెలిపారు.

బాధ్యతగా పనిచేయండి

• ఎంపీపీ పద్మజ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, అధికారులు

ఉదయగిరి: మండలంలోని మండల స్థాయి అధికారులు బాధ్యతగా పనిచేసి మంచిపేరు తేవాలని ఎంపీపీ మూలే పద్మజ అన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా చూడాలన్నారు. జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో బోర్లు వేయాలన్నారు. పట్టణంలో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని సభ దృష్టికి తెచ్చారు. అంతకుముందు ఆయా శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, సొసైటీ మాజీ అధ్యక్షుడు మూలే వినయ్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు సుభానీ, మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం మార్క్‌ఫెడ్ డీఎం పవన్ కుమార్ మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మొక్కజొన్నలు క్వింటాల్ రూ.1,962 ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. ధాన్యం 14 శాతం లోపు తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి చెన్నారెడ్డి, ఏఈఓ నారాయణ, వీఏఏ సబీనా పాల్గొన్నారు.

ప్రయాణికుడికి తీవ్ర అస్వస్థత

• కాపాడిన 108 సిబ్బంది



తీవ్ర అనారోగ్యానికి గురైన సలీంను ఆత్మకూరు ఆస్పత్రికి తీసుకెళ్తున్న 108 వాహన సిబ్బంది

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన షేక్ సలీం కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లాలని స్థానిక డాక్టర్లు సూచించడంతో శుక్రవారం బస్సులో ప్రయాణమయ్యారు. అయితే బస్సు కొద్ది దూరం వెళ్లగానే సలీంకు ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో బస్సులోనే పడిపోయాడు. దీంతో బస్సును డ్రైవర్ నిలిపివేసి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆత్మకూరు 108 సిబ్బంది నిమిషాల వ్యవధిలోనే అక్కడికి చేరుకుని అతనికి ప్రాథమిక చికిత్స అందించి తిరిగి ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. డాక్టర్ హిమబిందు సలీంను పరిశీలించి అప్పటికే అతనికి ఫిట్స్ వ్యాధితో పాటు లివర్‌కు సంబంధించిన జబ్బు ఉందని ప్రత్యేక వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లతో నెల్లూరుకు తరలిస్తామని డాక్టర్ హిమబిందు తెలిపారు.

దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న దంత వైద్యురాలు

చేజర్ల (సోమశిల): ప్రతి ఒక్కరు దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆత్మకూరు జిల్లా ఆస్పత్రి దంత వైద్యురాలు శోభాదేవి అన్నారు. శుక్రవారం అనంతసాగరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే దంత సంరక్షణపై జాగ్రత్త వహించాలని అన్నారు. పలువురు విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. రోజూ రెండు పూటలు దంతాలను శుభ్రం చేసుకోవాలని, అతి చల్లని, ఎక్కువ వేడి ఉండే పదార్థాలను తినరాదన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ డి.నారాయణరావు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో మహోత్సవాలు

దుత్తలూరు: మండలంలోని వెంకటంపేటలో వీరాంజనేయస్వామి ఆలయంలో పూజా మహోత్సవాలు శనివారం నుంచి సోమవారం వరకు వైభవంగా జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. శనివారం ఉదయం గణపతి పూజ, కలశపూజ, సహస్రనామ పూజ, మధ్యాహ్నం కర్పూర హారతి, నైవేద్యం, రాత్రికి పండరీభజన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి అభిషేకం, హోమం, పూర్ణాహుతి, నైవేద్యం, రాత్రికి ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ నెల 15న ఉదయం సహస్రనామ పూజలు, మధ్యాహ్నం కర్పూర హారతి, సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం జరుగుతాయన్నారు. మహోత్సవాల్లో అన్నప్రసాదం నిర్వహించడం జరుగుతుందన్నారు.

రేపు హనుమత్ జయంతి

వరికుంటపాడు: మండలంలోని విరువూరులో కొలువైన అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమత్ జయంతి వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం వేకువ జామునుంచే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అలంకరణలు, తీర్థ ప్రసాద, వినియోగ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

22న విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు

ఆత్మకూరు: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో ప్రతిభావంతులకు (దివ్యాంగులు) ఉపకరణాలు పంపిణీ చేసేందుకు వారిని గుర్తించే క్యాంపు ఈ నెల 22న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం సహకారంతో నియోజకవర్గంలోని ప్రతిభావంతులైన వారికి కావాల్సిన ఉపకరణాలు త్వరలో అందజేస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు, సంబంధిత వ్యక్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో అవసరమైన వారు ఆయా పంచాయతీల ద్వారా, మున్సిపల్ పరిధిలోని వారు మున్సిపల్ కార్యాలయంలో తమ పేరు నమోదు చేసుకోవచ్చునన్నారు.

విద్యుత్‌కు అంతరాయం

చేజర్ల(సోమశిల): అనంతసాగరంలోని విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రంలోని ఏబీ స్విచ్‌ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎంతో పలువురు ఉదయగిరి నేతలు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఉదయగిరి నేతల కరచాలనం






సీఎం జగన్‌తో మల్లు సుధాకర్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి

ఉదయగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కావలి పర్యటనకు వచ్చిన సందర్భంగా పలువురు ఉదయగిరి నియోజకవర్గ నేతలను హెలిప్యాడ్ దగ్గర సీఎం ఆప్యాయంగా పలకరించారు. ఉదయగిరి నియోజవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను ఆశిస్తున్న పలువురు వ్యక్తులు సీఎంను కలిసి బొకేలు అందించారు. సీఎంను కలిసిన వారిలో మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి, చేజర్ల చలమారెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పాముల రమణయ్య, అల్లూరు రాజు, మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గరువారెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎంతో మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు

మర్రిపాడు (ఆత్మకూరురూరల్): కావలి పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి శుక్రవారం కలిసి శాలువాతో సత్కరించారు. తనను ఆప్యాయంగా పలకరించి పార్టీ అభివృద్ధి కోసం ప్రజలతో మమేకమై పని చేయాలని సీఎం సూచించారని జెడ్పీటీసీ అన్నారు.

జగనన్నను చూడాలని..



కావలిలో జరిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభకు బయలుదేరుతున్న జగనన్న యూత్

అల్లూరు: జగనన్న మీద అభిమానంతో ఆయన్ను చూసేందుకు మండలానికి చెందిన ప్రజలు ప్రత్యేకంగా బస్సుల్లో వేలాది మంది కావలిలో నిర్వహించిన సభకు తరలివెళ్లారు. ఎంతో స్వచ్ఛందంగా తమ వాహనాల్లో వెళ్లడం విశేషం. స్థానిక కోనేటిమిట్ట సెంటర్‌లో సచివాలయం–1 కన్వీనర్ షేక్ జంషీర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జగనన్న యూత్ కార్యక్రమానికి బయలుదేరారు. కార్యక్రమంలో నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నిమ్మల భాస్కర్, షేక్ ఉస్మాన్, బత్తల సుధ, చెంతాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఇంటర్ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత



రామల కార్తీక్ (472 మార్కులు)



చింతం గోపికృష్ణ (449 మార్కులు)



గంగినేని రుషికేశవ్ (443 మార్కులు)

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): సీబీఎస్ ఈ సిలబస్ ద్వారా జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు 79 మంది సీనియర్ ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయగా నూరు శాతం ఉత్తీర్ణ సాధించారని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. వీరిలో రామల కార్తీక్, చింతం గోపికృష్ణ, గంగినేని రుషికేశవ్ అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ విద్యార్థులను అభినందించారు.

ఉపాధి హామీ ఆడిట్ గ్రామ సభలు



అనంతసాగరం మండలం ఉప్పలపాడులో ఉపాధి హామీ గ్రామ సభ

చేజర్ల (సోమశిల): 2022–23 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అనంతసాగరం మండలంలో జరిగిన పనులకు సంబంధించి ఆడిట్ జరుగుతోంది. శుక్రవారం పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. లింగంగుంట, మినగల్లు, మంచాలపల్లి, ఉప్పలపాడు, పడమటి కంభంపాడు, కామిరెడ్డిపాడు, వరికుంటపాడు, ఇనగలూరు గ్రామ సచివాలయాల్లో ఈ గ్రామ సభలు నిర్వహించారు. ఉపాధి సిబ్బంది, సామాజిక తనిఖీ బృందం ఈ ఆడిట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ (స్టేట్ రీసోర్స్ పర్సన్) మురాద్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో రికార్డుల పరిశీలన, గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల ఖర్చుల వివరాలు ఆడిట్ చేశామన్నారు. ఎక్కువగా కాలువల పనులు, పూడిక తీత పనులు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ దయాసాగర్ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఇంజినీరింగ్ విద్యార్థుల పరిశోధన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు రైతుభరోసా కేంద్రం పరిధిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఫీల్డ్‌ను ఇంజినీరింగ్ విద్యార్థులు శుక్రవారం పరిశీలించారు. ఆత్మకూరు ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సర విద్యార్థులు తమ కాలేజ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌లో భాగంగా కరటంపాడు రైతు నరసింహారావుకు చెందిన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి 30 రకాల విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తనకున్న 20 ఎకరాల పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారానే ఆరోగ్యకరమైన వివిధ రకాల పంటలు, ఆర్గానిక్ వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్నామని రైతు నరసింహారావు వివరించారు. అనంతరం కరటంపాడు రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ అధికారులు బీజామృతంతో విత్తనశుద్ధి రసాయనం తయారీ విధానాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కరటంపాడు ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు యస్దాని, శ్రావణి, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సుబ్బమ్మ, కాశీ వీరనారాయణ, సుబ్బరాయుడు, దొరసానమ్మ, నాగరాజు పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేయాలి



నర్సులను సన్మానించిన విశ్రాంత డీఎంహెచ్ఓ మాశిలామణి

వింజమూరు (ఉదయగిరి): వైద్య వృత్తిలో నర్సులు సేవా దృక్పథంతో పనిచేయాలని విశ్రాంత డీఎంహెచ్ఓ కె.మాశిలామణి అన్నారు. స్థానిక ఆస్పత్రిలో శుక్రవారం ప్రపంచ నర్సుల దినం నిర్వహించారు. నర్సులను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ రోగులతో నర్సులు మానవతా సంబంధాలు కలిగి ఉండాలన్నారు. వైద్య సేవలందించడంలో డాక్టర్లకంటే నర్సులు రోగులతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంటారన్నారు. నర్సులు కోవిడ్ సమయంలో తమ సేవలు అందించి ఎన్నో ప్రాణాలు కాపాడాలరన్నారు. ఎంతో మంది నర్సులు కోవిడ్ బారినపడి మృతి చెందారన్నారు. నర్సుల విధులను ప్రతి ఒక్కరూ అభినందించాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మలాదేవి, మల్లికార్జున, తదితరులున్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులు నాణ్యతా ప్రమాణాలతో చేయాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి అన్నారు. ఆయన శుక్రవారం పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల్లో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రహరీల నిర్మాణంలో గోడలు ఎత్తు పెంచాలన్నారు. సిమెంట్ పనుల అనంతరం క్యూరింగ్ బాగా చేయాలన్నారు. పనులన్ని పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సయ్యద్ కలీం, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.